

అల్లూరి సీతారామరాజు

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని వైసిపి అధినేత వైయస్ జగన్ పిలుపు మేరకు మండల పరిధిలోని కించాయి పుట్టు గ్రామ పంచాయతీ లో కోటిసంతకాల సేకరణ కార్యక్రమాన్ని విశాఖ ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ సుభద్ర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుభద్ర మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వంతో పోట్లాడి 17 వైద్య కళాశాలలను మంజూరు చేయిందన్నారు. నాటి వైసిపి ప్రభుత్వ కృషితో రాష్ట్రంలో సుమారు 10 వైద్య కళాశాలలు ప్రారంభించి పేద, నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు కేటాయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేసి కేంద్ర ప్రభుత్వానికి పి పి పి విధానం రద్దు చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పడగ విప్పిన ప్రకృతి

మొంథా తుఫాన్ మన్యంలో బీభత్సం సృష్టించింది. ఏకధాటిగా కురిసిన వర్షాలకు పలు గ్రామాలు కకావికలమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసి చేతికందుతుందనుకున్న పంట కాస్త నీటిపాలైంది. పలుచోట్ల రహదారులపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో అంధకారం నెలకొంది. వాగులు, వంకలు పోటెత్తి ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెరశి మన్యంలో పలు గ్రామాలు చిగురుటాకులా వణికిపోయాయి.

- మొంథా ఎఫెక్ట్‌తో మన్యంలో భారీ వర్షాలు
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- 12 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా
- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు
- వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలో సోమవారం రాత్రి నుండి బుధవారం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మంగళవారం రాత్రి నుండి ఈదురు గాలులు వేయడంతో లబ్బర్తి, దూసరపాము, కింద్రరోడ్ వయ్యాడు తదితర ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో మండలంలో 12 గంటలుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారిపై చెట్లను యుద్ధ ప్రాతిపదిగన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వరరావు, రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్, ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. రాజవొమ్మంగి నుండి అడ్డతీగల వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలపై చెట్లు కూలడంతో కొత్తవి ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వర్షాలకు ఒట్టిగడ్డ, గింజర్తి, నెల్లిమెట్ల, మాతంగి లబ్బర్తి అనంతగిరి వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పూర్తిగా వరదలు తగ్గేవరకు ప్రజలు రాకపోకలు సాగించరాదని అధికారులు సూచించారు. మండలంలోని ప్రత్తి, వరి, పొగాకు పంటలు ఈదురు గాలులకు పలుచోట్ల నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రెండు రోజులు తుఫాను ప్రభావంతో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని సూచించారు.

డిప్యూటీ కలెక్టర్ పరిశీలన

మండలంలోని కింద్ర తదితర గ్రామాల్లో నేలకొరిగిన వరి, పత్తి పంటలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, ఏవో చక్రధర్ బుధవారం పరిశీలించారు. రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వాతావరణంలో పలు తెగుళ్లు సోకుతాయని నివారణ చర్యలు పాటించాలని ఎఒ సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే శిరీషదేవి

ఎమ్మెల్యే శిరీషదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్ బుధవారం మండలంలో పర్యటించారు. ఒట్టిగెడ్డ, గింజర్తి కాలువను, ఒట్టిగెడ్డ రిజర్వాయర్ కూడా పరిశీలించారు. రిజర్వాయర్ సామర్థ్యం, ఎన్ని ఎకరాలకు నీరు అందుతున్నదీ ఒకవేళ రిజర్వాయర్ నిండితే జరిగే నష్టం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.



రాజవొమ్మంగి : ఒట్టిగెడ్డ రిజర్వాయర్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన సహాయచర్యలు చేపట్టినట్టు తెలిపారు. అధికారులు సమర్థంగా పనిచేశారని కొనియాడారు. నష్టాన్ని అధికారులు పరిశీలించి నివేదిక ఇస్తే ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

కొయ్యూరు: మండలంలోని తులబాడ, సింగవరం సమీపంలో గెడ్డలు రోడ్డుపై నుంచి పొంగి ప్రవహిస్తున్నాయని సిఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్‌వర్మ బుధవారం తెలిపారు. దీంతో చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళ్లే వాహనాలు, ఘాట్ రోడ్లో వాహనాలను కూడా నిలిపివేశామన్నారు. రావణాపల్లి పంచాయతీ రేవడవీధిలో మాదల గంగరాజు, చిన్నమ్ములకి చెందిన తాటాకు ఇల్లు కూలిపోయింది. కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు ఎస్ఐ కిషోర్‌వర్మ ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. మండలంలో విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొయ్యూరు నుండి చింతవాణిపాలెం వెళ్లే రోడ్డులో చెట్టు పడిపోవడంతో గ్రామస్తులు, పోలీసుల సహాయంతో తొలగించారు. తుఫాను నేపథ్యంలో మండలంలో వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ రైతులకు సూచించారు.



జికెవీధి: చెట్లను తొలగిస్తున్న అధికారులు

జికె వీధి: మండలంలోని పెదవలసలో కంకిపాటి చంద్రమ్మ, రంపులు కొత్త వీధి గ్రామంలో లకే ధర్మరాజు పెంకుటిళ్ల గోడలు కూలిపోయాయి. సమాచారం తెలుసుకుని విఆర్ఓ సత్యమణి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాణనష్టం జరగలేదని, తహశీల్దార్‌కు నివేదిక అందిస్తామన్నారు. జీకే వీధి ఆర్‌వి నగర్ జాతీయ రహదారిలో భారీవృక్షాలు నేలకూలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు చెట్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

మారేడుమిల్లి: సున్నంపాడు, దేవరపల్లి, మారేడుమిల్లి, కోడూరు గ్రామాల్లో కూలిన చెట్లను మారేడుమిల్లి సిఐ నరేంద్రప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది తొలగించే చర్యలు చేపట్టారు. కొత్తకోలనీ రహదారిలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. మారేడుమిల్లి -చిత్తూరు రోడ్‌లో రాకపోకలు నిషేధించారు.

గంగవరం: మండలంలో మంగళవారం గాలులకు నెల్లపూడి ప్రధాన రహదారిపై చింతచెట్టు కూలిపోయింది. ఎస్సై స్పందించి చెట్టును తొలగించే కార్యక్రమం చేపట్టారు.

అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం వేటమామిడి జాతీయ రహదారిపై ఏడు కరెంటు స్తంభాలు విరిగిపడడంతో అడ్డతీగల మండల కేంద్రంతో పాటుగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా లేక 24 గంటలుగా అంధకారంలోనే గడపవలసిన పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ కారణంగా ఈదురు గాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.



మారేడుమిల్లి : కొత్తకాలనీ వెళ్లే రహదారిలో విద్యుత్‌స్తంభాలు వేస్తున్న దృశ్యం



జికెవీధి: పెదవలసలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న విఆర్ఒ సత్యమణి



అడ్డతీగల : రహదారిపై కూలిన భారీ వృక్షం



కొయ్యూరు: రహదారిపై ఉన్న చెట్టు తొలగిస్తున్న అధికారులు

అంతటా... అతలాకుతలం

-నేల కొరిగిన పంటలు- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు



పాడేరులో ప్రవహిస్తున్న కొత్తపల్లి జలపాతం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మన్యంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు మొంథా తూఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకొని జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల భారీ వృక్షాలు నేల కొరిగాయి. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన వినయ్ చంద్..జిల్లా అధికారులను సమన్వయంతో ప్రణాళికతో ఎక్కడికక్కడ సహాయక చర్యలు చేపట్టారు. తుఫాను ప్రభావం ఉండే గ్రామాలను అప్రమత్తం చేశారు. కలెక్టర్ దినేష్ కుమార్, పాడేరు ఐటిడిఎ పిఒ శ్రీ పూజ, ఎస్ పి అమిత్ బర్దార్ ప్రత్యేక అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించారు. పాడేరు- విశాఖ రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించింది. పాడేరు మండలంలో రాయిగెడ్డ కాజ్ వే, మోదపుట్టు-అడ్డుమండ మార్గంలో వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుం డడంతో రాకపోకలు నిషేధించారు. దీంతో, ఆయా గెడ్డలకు ఆనుకుని ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. జిల్లాలో 77 చోట్ల పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఘాట్ మార్గాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. పాడేరు డిపో నుంచి బస్సు సర్వీసులను బుధవారం రద్దు చేశారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది.

పాడేరు: మన్యంలో మొంథా తుఫాన్ రెండు రోజులు తీవ్ర ప్రభావం చూపించింది. గత రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు నిండుకుండలా రాళ్ల గడ్డ మత్స్యగడ్డ పొంగి ప్రవహిస్తున్నాయి. కొత్తపల్లి జలపాతం వరద నీటి ఉధృతితో ఉరకలేస్తోంది. తుఫాన్ ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా ఒక మోస్తరు వర్షం ఏకధాటిగా పడుతుండడంతో పాటు ఈదురు గాలులు తీవ్రతతో జనసంచారం పూర్తిగా తగ్గింది. పట్టణంలోని దుకాణాలు షాపులు హొటల్లు అన్ని



పాడేరులో నేల కొరిగిన వరి పైరు

మూతపడ్డాయి. పాడేరు, హుకుంపేట, జిమాడుగుల తదితర మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరి పొలాల్లోకి వరద నీరు చేరడంతో వరి పంటకు నష్టం వాటిల్లింది. పాడేరు నియోజకవర్గంలోని పలుచోట్ల మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి, అరకు నియోజకవర్గ పరిధిలోని పలుచోట్ల జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పర్యటించి నష్టాలపై అధ్యయనం చేశారు.

కూలిన పాఠశాల భవనం

అరకులోయ రూరల్: మూడు రోజుల పాటు కురుస్తున్న మొంథా తుపాన్ కారణంగా మండలంలోని ఇరగాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కూలి పోయింది. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉన్నా మరమ్మతు చేయక పోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షానికి కూలి పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. గతంలో గ్రామస్తులు పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అరకులోయలో నిర్మానుష్యంగా ఉన్న పర్యాటక కేంద్రం

తుపానుతో నష్టం

జిమాడుగుల: మండలంలో తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల ఇల్లు, వృక్షాలు నేల కొరిగాయి. పాల మామిడి పంచాయతీ వనబంగి పాడు గ్రామంలో కిల్లో నాగేశ్వరావు చెందిన ఇంటి వంటపాకపై భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో అందులో ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు ఉరుము జంక్షన్ వద్ద కరెంటు స్తంభాలు భారీ ఈదురు గాలులకు నేల కొరిగాయి. విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. స్థానిక సర్పంచ్ రాంబాబు, విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. సోలభం పంచాయతీ సోలభం ఘాటీలో కొండ చరియలు విరిగిపడ్డాయి. పంచాయతీరాజ్ ఏఈ సమరెడ్డి మాణిక్యం సంఘటన స్థలానికి చేరుకొని జెసిబి సహాయంతో వాటిని తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. కంటవరం సమీపం వద్ద కల్వర్టు దెబ్బతింది. కొత్తపల్లి జలపాతం వద్ద నీటి ప్రవాహం తీవ్ర ఉద్రిక్తతతో ప్రవహిస్తుంది. రాజ్మా, కందులు పంట పూర్తిగా ధ్వంసం అయ్యాయి. రైతులు తీవ్ర ఆందోళనలో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలని కోరారు.

కూలిన ఇంటి గోడ

హుకుంపేట : మొంథా తుఫాన్ ప్రభావంతో హుకుంపేట మండలంలోని పట్టం పంచాయతీ బూరువలస గ్రామానికి చెందిన రైతు సింగరపు బోడన్న ఇంటి గోడ బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయానికి ఇంట్లో బోడన్న కుటుంబ సభ్యులు, చిన్నపిల్లలు నిద్రలో ఉండడంతో ఒక్కసారిగా గోడ కూలి పోవడంతో అందరూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. . భయంతో కుటుంబ సభ్యులు పక్కింటికి పరుగులు తీశారు.

అరకులోయ: గత మూడు రోజుల నుంచి కంటికి కునుకు లేకుండా ఆందోళనకు గురిచేసిన మొంథా తుఫాను బుధవారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టడంతో ఈ ప్రాంతం వాసులు ఊపిరి పీల్చుకున్నారు. తెరిపి లేకుండా ఈదురుగాలితో కూడిన కుండ పోత వర్షం కురవడంతో గిరిజనులు ఇంటి నుంచి బయటికి రాలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వర్షం ఎడతెరిపి లేకుండా బుధవారం మధ్యాహ్నం వరకు కురిసింది. చొంపి గడ్డ పొంగి ప్రవహించడంతో పోలీసులు బారికెట్లు పెట్టి రాకపోకలు నిషేధించారు. ఇరగాయి పంచాయతీ కేంద్రంలోని ఓ స్కూల్ బిల్డింగు కూలిపోయింది, పెద్దగడ్డ పొంగడంతో అక్కడి కొంతమందిని ధన సనివలసకు తరలించారు. అరకులోయ ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలన్నీ మూతపడ్డాయి.



జి.మాడుగులలో కూలిన చెట్టు



అనంతగిరి మండలం డముకు రోడ్డు మధ్యలో బండ రాళ్లు

గాలికొండ ప్రాంతంలో రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయమయి చెరువును తలపింపచేసాయి. చిన్న లబ్బుడు పంచాయితీ గ్రామాల్లోని పంట పొలాలు కొన్ని నీట మునిగాయి.

చింతపల్లి : మొంథా తుఫాన్ ఉధృతి బోడకొండమ్మ ఘాట్ మార్గంలో తీవ్రంగా చూపింది. మంగళవారం అర్ధరాత్రి మొదలైన భారీ వర్షాలు, గాలులకు కొండచరియలు విరిగిపడటంతో రహదారిపై చెట్లు, బండరాళ్లు అడ్డంగా కూలిపోయాయి. దీంతో చింతపల్లి-నర్సీపట్నం మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఘాట్ మార్గంలో అనేకచోట్ల చెట్లు అడ్డంగా పడిపోవడంతో పాటు, కొండ తొర్రలు కోతపడి మట్టి, రాళ్లు వరుసగా రోడ్డుపైకి జారికొచ్చాయి. అత్యవసర సేవల వాహనాలు కూడా చిక్కుకోవడంతో సహాయక చర్యలు సాగడంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. వర్షంలో వాహనాలు రాత్రంతా రహదారిపైనే నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న చింతపల్లి సీఐ ఎం.వినోద్‌బాబు ఆదేశాల మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని రక్షణ చర్యలు ప్రారంభించారు. భారీ చెట్లు, బండరాళ్లను జెసిబి సాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కొత్రుబయలు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న కాలువలోకి కారు దూసుకెళ్లింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొండల పైభాగాల నుంచి ఉధృతంగా వస్తున్న వరదనీరు తురబడగడ్డ వంతెన వద్ద ఎగసిపడడంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఘాట్ మార్గంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణం చేయవద్దని ఎస్సై వెంకటేశ్వరరావు సూచించారు.

కెకె లైన్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

ప్రజాశక్తి -అనంతగిరి: కొత్తవలస-కిరండోల్ కేకే లైన్ మార్గమధ్య పట్టలపై కొండ చరియలు విరిగిపడ్డాయి. మండలంలోని మొంథా తుఫాన్ ప్రభావ కారణంగా కేకే లైన్ బొర్రా- చిమిడిపల్లి. 65/5 మైలురాయి సమీపంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ముందస్తు చర్యల్లో భాగంగా విశాఖ -కొత్తవలస మీదుగా బొర్రా, .అరకు, కిరండోల్ కు వెళ్ళు పలు రైళను ఆది, సోమవారం రద్దు చేశారు. ఈ ఘటనను తెలుసుకున్న సంబంధిత రైల్వే శాఖ అధికారులు బుధవారం తెల్లవారుజాము నుండి పునరుద్ధరణ సహాయక చర్యలు ముమ్మరం చేశారు. డమ్ముకు పులుసుమామిడి, వాలసి, కుంబర్తి, వేంగడా. పిన్నకోట, పెద్దకోట తదితర ప్రధాన రహదారుల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.



తొలగిస్తున్న సిబ్బంది

రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు

ఆసుపత్రి తనిఖీలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ హేమలతాదేవి

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ముఖ్య పర్యవేక్షక అధికారిణి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి హేమలత దేవి ఆసుపత్రిలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆసుపత్రిలో రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తగు ఏర్పాట్లపై ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అన్ని వార్డులను సందర్శించి రోగులను పరామర్శించారు. ప్రసూతి విభాగంలో ఉన్న గర్భిణీలను, బాలింతలను పరామర్శించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, పిల్లల, ఇలా అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సౌకర్యాలపై వాకబు చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ఏ ఇబ్బంది కలిగినా తక్షణం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మల మూత్ర శాలలు శుభ్రంగా వాడుకోవాలని రోగులకు సూచించారు. నీటి సమస్య, విద్యుత్ సమస్య రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రసూతి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సృజన, ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకట్, నర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

సహాయక చర్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-పాడేరు: తుఫాను కారణంగా తలెత్తిన నష్టాన్ని అంచనా వేయడం, సహాయక చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. తుఫాన్‌లో సమర్థవంతంగా పని చేసిన ప్రభుత్వ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్‌లో నిరంతరంగా క్షేత్ర స్థాయిలో తిరుగుతూ, సమర్థవంతంగా జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది పని చేసారని తెలిపారు. ఇదే స్ఫూర్తి తో ఇంకో రెండు రోజులు పని చేయవలసి ఉంటుందన్నారు. విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనా, గృహ నష్టం సర్వే, సహాయ కేంద్రాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మొదట 150 ఎకరాల వరకు మాత్రమే పంట నష్టం ఉందని నివేదించినప్పటికీ, ఈ సంఖ్య ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. నష్టాన్ని అంచనా వేసేటప్పుడు ఫోటోలు, వీడియోలు, పూర్తి డాక్యుమెంటేషన్‌తో ఎస్టిమేట్ పంపాలన్నారు. తుఫాను కారణంగా పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న గృహాలు 106 కాగా ప్రతి దెబ్బతిన్న ఇంటికి సంబంధించి వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కనీసం నాలుగైదు ఫోటోలతో పాటు రిపోర్ట్ పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం 13 పునరావాస కేంద్రాల్లో 774 మందిని తరలించి భోజనం వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. అప్పర్ ప్రైమరీ హైస్కూల్స్ యథావిధిగా నడవాలని చెప్పారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడలో అభివృద్ధి పనులు పక్కగా అమలయ్యేలా నివేదికను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. డుంబ్రిగుడలో పర్యటించిన ఆయన తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న నివాస గృహాలను పరిశీలించారు. డ్రైనేజ్ నిర్మాణాలతో గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. చాపరాయి జలవిహారి ఆదాయంలో పంచాయతీకి 20 శాతం కేటాయించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో వ్యవస్థలను గీత, సర్పంచ్ వెంకటరావు విన్నవించారు. చాపరాయిలో పార్కింగ్ అభివృద్ధికి ఐటీడీఏ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తహసీల్దార్ త్రివేణి ఆదేశించారు. అనంతరం తుఫాను ప్రభావంతో వంతాడ్లలో నేల మట్టమయిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలతోపాటు, అంగన్వాడీ కేంద్రాల భవనాల తొలగింపుకు నెల రోజుల్లో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తుఫాను నష్ట నివేదికను త్వరితగతిన అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని కించాయి పుట్టు గ్రామపంచాయతీ పరిధిలో సరియా పుట్టు గ్రామం, గుమ్మ సిరగం పుట్టు గ్రామ సమీపంలోని రోడ్లకు విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ వైస్ పర్సన్ సుభద్ర బుధవారం భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ, దశాబ్దాల కాలం నుండి హెడ్ క్వార్టర్ పంచాయతీ పరిధిలో సరిగాపుట్టు, గుమ్మ సిరగం పుట్టు గ్రామ సమీపంలోని అధ్వన్న రోడ్డు గురించి నిధులు కేటాయించామని తెలిపారు.

తుపాను ప్రాంతాల్లో సిపిఎం నేతల పర్యటన


హుకుంపేటలో పరిశీలిస్తున్న అప్పలనర్స

ప్రజాశక్తి -హుకుంపేట: మొంథా తుఫాన్ ప్రభావంతో పంట పొలాలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హుకుంపేట మండలం రంగశిల పంచాయతీ పరిధిలోని బోలోర్ద్దా గ్రామంలో గిరిజన సంఘం నాయకులతో కలిసి తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పర్యటించారు. స్థానిక రైతు కిల్లో రామారావు వరి పొలంలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం చీడుపుట్టు వంతెనను పరిశీలించి ప్రభుత్వం నూతన వంతేన ఏర్పాటు చేసి ప్రజలకు రాకపోకలు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన ప్రభుత్వానికి కోరారు. ఈ సందర్భంగా పి.అప్పలనరస మాట్లాడుతూ,"తుఫాన్ కారణంగా అనేక మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారన్నారు. పంటల నష్టాన్ని అధికారులు పూర్తిస్థాయిలో అంచనా వేయకుండా తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జోరెలా పక్కన ఉన్న భూముల్లో ఇంకా సాగు చేస్తున్న రైతులకు గ్రామ సభలు ఏర్పాటు చేసి వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం తుఫాన్‌తో్ల రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంలో కోతలు విధించడం, ఆలస్యం చేయడం సర్వసాధారణంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ, నాయకులు దాసు, ఆనంద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.


అనంతగిరిలో పరిశీలిస్తున్న గంగరాజు

అనంతగిరి: మండలంలోని మొంథా తుపాన్‌తో ఆస్తి ప్రాణ నష్టం వంటి వాటిపై మండల సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టాలను గుర్తించాలని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు అన్నారు. మొంథా తుఫాన్ తీరం దాటిన అనంతరం మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో సంబంధిత పంచాయతీ సిబ్బందిలతో కలిసి నష్టాలపై సర్వే నిర్వహించారు. తుపాన్ కారణంగా ఇల్లు, పంటలు, రోడ్లు వంతెనలను. దెబ్బతినడంతో వాటిపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 24 పంచాయతీ మారుమూల గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది పర్యటించి నష్టాలను గుర్తించాలన్నారు. బాధిత రైతుల ను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించే విధంగా అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. గిరిజనులు నష్టంపై న్యాయం జరగలేదని తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు నాగులు, సెక్రెటరీ. దేవా పాల్గొన్నారు.

అరకులోయ: మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది. తుపాన్ కారణంగా అరకువేలి మండలం చినలబుడు పంచాయితీ దొరవలస, గొందివలస, తుడుం గ్రామాల్లో మువ్వల రాజు, వంతాల దస్మత్, గొల్లూరి సొన్ను పంటపొలాల్లో దెబ్బతిన్న వరి పంటను ఆదివాసి గిరిజన సంఘం బందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, మొంథా తుఫాన్ ప్రభావం అల్లూరి సీతారామరాజు జిల్లాలో తీవ్రమైన ప్రభావం చూపిందని వరి, చోడి , సామలు, రాజ్మా పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు.



అరకులోయలో పర్యటిస్తున్న సర్పంచ్

కొన్ని పంట పొలాలను మట్టితో కప్పివేసిందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల జిల్లా మండల అధికార యంత్రాంగం సమగ్రమైన సర్వేలు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, పంట బీమా పథకం అమలు చేయాలన్నారు.ఇల్లు కోల్పోయిన వారికి మంజూరు చేయాలని, కల్వర్టు ,రోడ్లు, వంతెనలు మరమ్మతు చేయాలని తెలిపారు. కూలిపోయిన పాఠశాల భవనాలను యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం చినలబుడు పంచాయతీ నాయకులు, పెసా కార్యదర్శి ముసిరి మల్లన్న, కొర్రా సుబ్బారావు, కొర్రా రాజు, ముసిరి అప్పన్న, అప్పారావు, మువ్వల రాజు, మామిడి రాంబాబు, గెమ్మెల దాసు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధి ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామంలోని ఇళ్లకు, పంట పొలాలకు భారీ నష్టం వాటిల్లింది. స్థానిక సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ముందుకు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. సుంకరమెట్ట పరిధి గ్రామాల్లో తోటవలస గ్రామానికి బురిడీ రామ్మూర్తి, కొత్తవలస కొర్ర నాగరాజు, దవదగూడ చట్టం నాయక్ కోములు, పిరిబంధ గెమ్మెలి సావిత్రి ఇల్లులకు నష్టం వాటిల్లింది.దీనిపై సర్పంచ్ ప్రతి గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక యువకులతో కలిసి రోడ్లపై చెత్త, చెట్ల కొమ్మలను తొలగించారు. బస్కీ పంచాయతీ జాకరవలస గ్రామంలో పాంగి ప్రహ్లాద్,బురిడి అర్జున్,కె హరి ఇల్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పంటలు పూర్తిగా నష్టపోయిందని వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు డిమాండ్ చేశారు. నష్టపోయిన కుటుంబానికి 50 కేజీల బియ్యం, 5 కేజీలు కందిపప్పు, వంట నూనే వంటి సరుకులు పంపిణీ చేయాలన్నారు. బస్కి పంచాయతీ పంచాయతీ 27 గ్రామ పరిధికి చెందిన గిరిజనులు సాగు చేస్తున్న పంట పొలాలు నీటి మునిగాయని మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్ తెలిపారు.

తుపాన్ ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - అరకులోయ: మొంథా తుఫాను కారణంగా అరకు, అనంతగిరి ఘాట్ రోడ్‌లో కొండపై నుంచి వర్షపు నీరు రోడ్డుపై ఎక్కువగా పారుతుందని నీటి ప్రవాహం పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని పాడేరు డి.ఎస్.పి షేక్ సెహ బాజ్ అహ్మద్ అన్నారు. అరకులోయ మండలంలో 15 ఇల్లులు, అనంతగిరి మండలంలో 50 ఇళ్లకు నష్టం వాటిల్లిందన్నారు. జడ్పిటిసి శెట్టి రోషిణి, వైసిపి మండల అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి, కమిడి అశోక్, వైస్ ఎంపీపీ సుమాంజలి ఘాట్ రోడ్ ను పరిశీలించారు. ఈ అరకులోయ సిఐ హిమగిరి, ఎస్సైలు గోపాల్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరకులోయ: అల్లూరి సీతారామరాజు ఎస్‌పి అమిత్ బర్దర్ మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలోని సుంకరమెట్ట, గాలికొండ, బిసుపురం గ్రామాలను సందర్శించారు. తుపాను కారణంగా అనంతగిరి, అరకులోయ ఘాట్ రోడ్డులో వాహన రాకపోకలు నిషేధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్త, చెట్లు ఇతర అడ్డంకులను తొలగించే వరకు అక్కడే ఉండాలని పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కొనసాగుతున్న కూడా రోడ్లను పూర్తిగా శుభ్రం చేసి, నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడేరు డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్, అరకులోయ సీఐ హిమగిరి, అరకు, అనంతగిరి ఎస్ఐలు గోపాలరావు, శ్రీనివాసరావు సహాయక చర్యలను పర్యవేక్షించారు.

బోడకొండమ్మ ఘాట్‌లో విరిగిపడిన కొండ చరియలు

ప్రజాశక్తి-చింతపల్లి : మొంథా తుఫాన్ ఉధృతి బోడకొండమ్మ ఘాట్ మార్గంలో తీవ్రంగా చూపింది. మంగళవారం అర్ధరాత్రి మొదలైన భారీ వర్షాలు, గాలులకు కొండచరియలు విరిగిపడటంతో రహదారిపై చెట్లు, బండరాళ్లు అడ్డంగా కూలిపోయాయి. దీంతో చింతపల్లి-నర్సీపట్నం మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఘాట్ మార్గంలో అనేకచోట్ల చెట్లు అడ్డంగా పడిపోవడంతో పాటు, కొండ తొర్రలు కోతపడి మట్టి, రాళ్లు వరుసగా రోడ్డుపైకి జారికొచ్చాయి. అత్యవసర సేవల వాహనాలు కూడా చిక్కుకోవడంతో సహాయక చర్యలు సాగడంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. వర్షంలో వాహనాలు రాత్రంతా రహదారిపైనే నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న చింతపల్లి సీఐ ఎం.వినోద్‌బాబు ఆదేశాల మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని రక్షణ చర్యలు ప్రారంభించారు. భారీ చెట్లు, బండరాళ్లను జెసిబి సాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. కొత్రుబయలు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న కాలువలోకి కారు దూసుకెళ్లింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొండల పైభాగాల నుంచి ఉధృతంగా వస్తున్న వరదనీరు తురబడగడ్డ వంతెన వద్ద ఎగసిపడడంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఘాట్ మార్గంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రయాణం చేయవద్దని ఎస్సై వెంకటేశ్వరరావు సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలో హెల్త్‌అసిస్టెంట్ల పునర్నియమకానికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ఇది ఎంతో సంతోషదాయకమని అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంత వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శెట్టి నాగరాజు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను పది నెలల క్రితం తొలగించడంతో ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. విచారణ చేపట్టిన హైకోర్టు హెల్త్ అసిస్టెంట్స్ ను తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకోవాలని తీర్పు ఇచ్చిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తుల్ని తిరిగి విధుల్లోకి చేర్చుకోక పోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. సుప్రీంకోర్టు హైకోర్టు ఉత్తర్వులను కొనసాగిస్తూ తొలగించిన ఉద్యోగస్తులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చిందని చెప్పారు.

తుపాను బాధితులకు రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొంథా తుఫాను ప్రభావంతో కచ్చా ఇల్లులు జారి పోవడంతో వాటిని గుర్తించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బుధవారం బాధితులకు పలు సామాగ్రిని అందజేసింది. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ బృందం పలు వంటసామాగ్రి, టార్పా లిన్ తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోర్ర నాగరాజు సొంత నిధులతో బస్తా బియ్యం, కూరగాయలు మంచి నూనె అందజేశారు. క పాడేరు మండలం మినుములూరు, కందమామిడి గ్రామాలలో మట్టి ఇల్లులు కూలిపోయిన వారికి తమ వంతు సహకారాన్ని అందజేశారు. కందమామిడి ఆశ్రమ పాఠశాలలో పునరావేశ కేంద్రాన్ని పరిశీలించి వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోర్ర నాగరాజు, జిల్లా వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్రావు, కోశాధికారి సూర్యారావు, కార్యవర్గ సభ్యులు ప్రసాద్ నాయుడు మినుములూరు మాజీ ఎంపీటీసీ రమణ పాల్గొన్నారు.


సంతకాల సేకరణలో ఎంపిపి బోయిన కుమారి

సీలేరులో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా అల్లూరి జిల్లా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు సూచనల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జీకే వీధి మండలం సీలేరులో బుధవారం చేపట్టామని జీకే వీధి ఎంపిపి బోయిన కుమారి, మండల వైసిపి అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా వీరు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సర్పంచ్ పాంగి దుర్జో, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన వైసిపి నూతన కమిటీ సభ్యులు

వైసిపి మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో సర్పంచ్ పాంగి దుర్జో మండల వైసిపి అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో వైసిపి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సీలేరు వైసిపి అధ్యక్షులుగా పేలూరి సత్యనారాయణ (బుజ్జి), ప్రధాన కార్యదర్శులుగా దేవాది గణేష్ , చెందాడ నూకరాజు, కంచు బాబులాల్ కార్యదర్శులుగా కిముడు విశ్వనాథం, వంతల మారిబాబు శ్రీకాకుళం నూకరాజు కొర్ర రాజేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం నుంచి సీలేరు పంచాయతీ వైసిపి అధ్యక్షురాలుగా కంకిపాడు రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శులుగా కిల్లో నాగమణి, వంతల దోన కార్యదర్శులుగా వంతల రజిని, కుప్ప కుమారిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోయిన కుమారి, సీలేరు ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, లక్కవరపేట ఎంపిటిసి సత్యనారాయణ పాడేరు ఎస్సీ సెల్ అధ్యక్షురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

తమన్నదొర పేరుపై కొత్త జిల్లా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- విఆర్‌పురం: ప్రస్తుతం ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేయడం వలన పోలవరం నిర్వాసిత మండలాలు ఎటపాక, చింతూరు, కూనవరం, విఆర్ పురం ఈ నాలుగు మండలాల ప్రజలకు వారి అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రం పాడేరు వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రంపచోడవరం కేంద్రంగా కారం తమన్నదొర జిల్లాగా ఏర్పాటు చేయాలని ఎటపాక డివిజన్ విఆర్‌పురం మండలం ఆదివాసీ జెఎసి డివిజన్ వైస్‌చైర్మన్ వేటకాని మల్లయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వాటర్ ట్యాంకులు పరిశుభ్రం

ప్రజాశక్తి-కూనవరం: మండలం లోని పెద్ద ఆర్కూర్ పంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంకులను సర్పంచ్ నాగమణి ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. రెండు రోజుల నుంచి గ్రామాల్లో వాటర్ ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేశామన్నారు, పైప్‌లైన్లు అక్కడక్కడ లీకులు ఉన్నాయని, వాటివల్ల కొన్ని వాటర్ ట్యాంకులకు నీరు రావడం లేదన్నారు. త్వరలో పనులు పూరి చేస్తామని ఆమె తెలిపారు.


ట్యాంకులు శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

తోకరాయి, చట్రాపల్లి బాధితులకు సిఎం ఆర్థికసాయం

ఐటిడిఎ పిఒ శ్రీపూజ

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండ , సప్పర్ల పునరావాస కేంద్రాలను పాడేరు ఐటిడిఎ పిఒ శ్రీపూజ బుధవారం సందర్శించారు. తోకరాయి గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ధారకొండ పంచాయతీ తోకరాయి, గాలికొం డ పంచాయతీ చట్రాపల్లిలో బాధితులకు ఒక్కొక్క కుటుంబంలో ఒక్కరు ఉంటే రూ.1000 ఇద్దరు ఉంటే రూ. 2వేలు ముగ్గురు కంటే అంతకంటే ఎక్కువ మంది ఉంటే రూ.3 చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన ఆర్థిక సహాయాన్ని బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తారన్నారు. దీంతో పాటు 25 కేజీల బియ్యం, పామాయిల్, బంగాళదుంపలు, ఉల్లిపాయలు అందిస్తారన్నారు. అనంతరం సప్పర్ల ఆశ్రమ పాఠశాల పునరావాస కేంద్రంలో వారిని పరామర్శించారు. నగదు జమ చేయడానికి బ్యాంక్‌అకౌంట్, ఆధార్‌కార్డులు అధికారులకు అందజేయాలన్నారు. త్వరలో చట్రాపల్లి తోకరాయి గ్రామస్తులకు మోడల్‌కాలనీ నిర్మాణానికి చర్యలు చేపడుతు న్నట్టు తెలిపారు. వసతి, వైద్య సదుపాయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఇఇ బాలసుందరబాబు, జీకే వీధి తహశీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.


పునరావాస కేంద్రంలో చట్రాపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న పిఒ పూజ

చట్ట విరుద్ధంగా సాగుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కూనవరం: గిరిజనేతరులు గిరిజన భూములను లీజుకు తీసుకొని చట్టాలకు విరుద్ధంగా సాగు చేస్తున్న వారిపై ఎస్సీ ఎస్టీ ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తెల్లం తమ్మయ్య డిమాండ్ చేశారు. స్థానిక శ్రీ మార్త శ్రీరాంమూర్తిభవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతూరు ఐటిడిఎలో ఎల్‌టిఆర్ కేసులకు సంబంధించి సిబ్బందిని నియమిస్తున్నందుకు ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞత తెలిపారు. ఐదో షెడ్యూల్ ఏరియాలోని చట్ట ప్రకారం నేరమని తెలిసి కూడా నాలుగు మండలాల్లోని కొన్ని వందల ఎకరాలు సాగు చేస్తున్న వారిపై అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. జామాయిల్ కొనుగోలు చేసే మధ్య దళారీలుగా ఉంటూ కాటా తప్పులు చెప్పి మోసం చేస్తున్నారని వీరిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాయం సీతారామయ్య , బాబు బోర్రయ్య పాల్గొన్నారు.




మాట్లాడుతున్న తెల్లం తమ్మయ్య

పోచవరం, కాచవరాన్ని 41.5 కాంటూరులో కలపాలి

- మంత్రి నిమ్మలకు తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల వినతి

ప్రజాశక్తి-కూనవరం: కూనవరం మండలం కాచవరం, పోచవరం పంచాయతీలను 2006 రెవెన్యూ లెక్కల ప్రకారం ఆయా పంచాయతీల్లో ఉన్న గ్రామాలను 41.15 కాంటూరులో కలపాలని మంత్రి నిమ్మల రామానాయుడుకి తెలుగు యువత అధికార ప్రతినిధి రంజితకుమార్ వినతిపత్రం అందించారు. మంత్రి నిమ్మల రామానా యుడును బుధవారం వెలగపూడి సచివాలయంలో కలిశారు. మూడు నెలల కిందట ఆయన సూచనల మేరకు రాష్ట్ర పునరావాస కమిషనర్ పోలవరం అడ్మినిస్ట్రేటివ్ అధికారిని కలిసి వినతి అందించిన విషయం గుర్తు చేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు గారపాటి రాంబాబు, తోటకూర వీర్రాజు, బూత్ ఇంచార్జి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.


మంత్రి నిమ్మలకు వినతి ఇస్తున్న రంజిత్‌కుమార్

కూలిన పాఠశాల భవనం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:- మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని పోతంగి పంచాయితీ గ్రామ పాఠశాల భవనం బుధవారం కూలి పోయింది. ఆ పాఠశాల భవనం గతంలో నుంచి పూర్తిగా శిథిలావస్థలో ఉన్నా మరమ్మతు చేయలేదు. ప్రస్తుతం కురిసిన తుఫాను ప్రభావం కారణంగా కూలి పోయింది. పాఠశాల తరగతులు నిర్వహించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఆ గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మండల ఎంఈఓ 2 జి గేన్ను బుధవారం పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ వర్షంతో కోసంగి, చంపపట్టి గెడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంత గిరిజనులకు రవాణా రాకపోకలు పూర్తిగా స్తంభించుకు పోయాయి. వైసిపి నాయకులు శంకర్, విజయదశమి వంతర్ద పాఠశాల భవనాన్ని పరిశీలించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

- ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ వహించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. బుధవారం మండలంలోని స్థానిక ఏకలవ్య పాఠశాల, గురుకుల కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జిమ్ పరిశీలించి ఏ విధంగా ఉపయోగపడుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక గురుకుల కళాశాలను పరిశీలించారు. అనంతరం కళాశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు,ఎంపిటిసిలు పెద్దిరాజు, నల్ల సత్యనారాయణ, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ పిల్లి సరిత

గంగవరం పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - గంగవరం: స్థానిక పిహెచ్ సిని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ పిల్లి సరిత బుధవారం తనిఖీ చేశారు. పేషెంట్స్‌ను వైద్యసేవలు సరిగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసిలో మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. గర్భిణులను సరైన భోజనం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిర్మాణంలో ఉన్న బర్త్ వెయిటింగ్ హాల్ భవనాన్ని సందర్శించారు. అంబులెన్సు సర్వీస్ ఎన్ని ఉన్నాయి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకున్నారు.

రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి -హుకుంపేట : పంట నష్టపరిహారం చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని మాసాడ గ్రామాన్ని సందర్శించారు.దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. చీడిపుట్టు మార్గంలోని అడ్డుమండ వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొంథా తుఫాన్ కారణంగా ప్రాణనష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. అధికారులు వెంటనే రైతుల వివరాలను సేకరించి నివేదికను సమర్పించాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. సుధాకర్, తహసిల్దార్ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షులు శతక బొంజు బాబు, బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు,హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ్మ,దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, మండల ప్రధాన కార్యదర్శి సిర్గం సూర్యకాంతం, మాజీ సర్పంచ్ కొర్ర వాసుదేవరావు పాల్గొన్నారు.